[కథానిక]

ప్రభాతం

'నిరంజన్'

పెళ్లిసందడితో ఊరు మోగిపోతోంది. సుమ మొగుడు డాక్టరుపరీక్షకు చదువుతున్నాడనీ, అన్నివిధాలా ఈడూజోడైన సంబంధంఅనీ చెప్పుకుంటున్నారు. వ్యయప్రయాసలకు లెక్కచేయకుండా తండ్రి సర్వహంగులతోనూ వివాహతంతు వైభవంగా జరిపిస్తున్నాడు. బాజాభజంత్రీలతోనూ, పురోహితుల మంత్రాలతోనూ పెళ్లి వారిల్లు కోలాహలంగా ఉంది. ఆ మేళాలూ, ఆ గాసులైట్లూ, ఆ సందడీ చూస్తూ పిల్లలు ఉత్సాహం పట్టలేకపోతున్నారు. కాని మధుకర్ కుమాత్రం ఆ వినోదాలమీదికి మనసు పోవటంలేదు. సుమకు పెళ్లవటం బాల్యస్నేహితుడైన మధు కంత సంతోషించతగ్గ విషయంగా కనపడలేదు. పెళ్లయాక సుమ ఎక్కడికో ఇంకోవూరు వెళ్లిపోతుందని విన్నప్పటినుంచీ మధుమనస్సులో పెద్ద రాయి పడ్డట్టయింది.

సుమ వెళ్లిపోతే తను ఇక అధికారం ఎవరిమీద చలాయిస్తాడు! సుమను ఏడిపించినా, నవ్వించినా, ఆర్డర్లు వేసినా అది తన ఇష్టారాజ్యం. స్వార్జితమైన ఈ అధికారంఅంతా అన్యాయంగా చెయిజారిపోతుంటే మధుకు కష్టం వేసింది. కొద్ది దిగులుకూడా కలిగిందని చెప్పటం న్యాయం. మధుకు డాక్టర్లన్నా మొగుళ్లన్నా పట్టరాని అసహ్యం పుట్టుకొచ్చింది!

"సుమా, మన వూర్నించీ ఎక్కడికో వెళ్లిపోతావుటగా! నాకుమల్లే అక్కడ నీతో కబుర్లు చెప్పటానికి ఎవ రుంటారు?" అన్నాడు మధు, సుమ వెళ్లిపోయినా తనకుమాత్రం ఏమీ ఫరవాలేదన్నట్టు! సుమ గుడ్లనీళ్లు కుక్కుకుంటూ పలక్కుండా నుంచుంది. తన బెదిరింపు ఈవిధంగా పనిచేస్తుందని మధుకూడా అనుకోలేదు. నిర్ఘాంతపోతూ సుమకళ్లనీళ్ల వంక చూసి మధు మెల్లిగా అక్కణ్ణుంచీ తప్పుకున్నాడు.

పెళ్లయినతరవాత సుమ ఎప్పటిలాగా తమ ఇంటికి వస్తూ పోతూ తనతో మామూలుగా మాట్లాడుతూ ఉండటంతో మధుకు డాక్టర్లమీద కలిగిన అసహ్యం క్రమంగా మాసిపోయింది.

బాల్యంలో మనసులు ఎంత అమాయకంగా ఉంటయ్! సెలవులకు ఇంటికి వెళ్తున్న మధుకర్ సుమ పెళ్లిముందు జరిగిన ఆ సంభాషణ జ్ఞాపకం తెచ్చుకొని చిరునవ్వు నవ్వుకున్నాడు. ఒంటెద్దుబండీ ఎత్తెత్తి కుదేస్తూ ఈడిగిలబడి సాగిపోతోంది. మధుమనస్సులో బాల్యస్మృతులన్నీ ఒకదానివెంట ఒకటి కమ్ముకొని వచ్చినై. ఊరివెలుపల మైదానంలో ఆడుకొన్న ఆటలూ, దేవుడిగుళ్లో పెద్దవాళ్లకు తెలియకుండా చేసుకున్న దొంగవిందులూ, ఇరవైనాలుగుగంటలూ భళ్లుభళ్లున దగ్గుతూ ఈ వెధవలుమాత్రం కులాసాగా ఎందుకుండాలన్నట్టు అందినవాణ్ణల్లా చితకబాదే ఆ పేద బడిపంతులూ గుర్తుకు వచ్చారు.

చిన్నతనంలో మన స్వెప్నుడూ ఏదో నిష్కారణమైన ఉల్లాసంతో పొంగిపోతూ ఉంటుంది; ఎటువంటి బాధలూ కష్టాలూ మనస్సు కప్పుడు గాఢంగా తాకవు. ఆ లేతవయసులో ఆ ఉత్సాహమే లేకపోతే పిల్ల లీప్రపంచంలో బతికి బట్టగట్టడమే అసంభవమేమో అనిపించింది మధుకు. చిన్నతనంలో తను చేసిన అల్లరిచేష్టలకీ ఆకతాయితనానికీ నిజంగా మేర లేదు. తోటి ఈడుపిల్లలెవరన్నాసరే ఒంటికాలిమీద లేచేవాడు.

సుమమాత్రం, మొదట్నుంచీ మృదుస్వభావ

అవటంచేత, తను ఎన్ని తిప్పలు పెట్టినా, పాపం, సహించి ఊరుకొనేది. ఒకసారి ఎందుకో పోట్లాట వచ్చి తను తోసేసరికి సుమ కింద బడి మోకాలికి దెబ్బ తగిలింది. మర్నాడు వాళ్లమ్మ గాయం చూసి, ఎక్కడ పడ్డావు తల్లీ, ఇంత చేటుదెబ్బ తగిలించుకున్నావని అడిగింది. దురదృష్టవశాత్తు అప్పుడు తనుకూడా అక్కడే ఉన్నాడు. సుమ ఏం చెబుతుందో, తన కేం ముంచుకు వస్తుందో అని గుండెలు దడదడ కొట్టుకుంటున్నయ్. సుమ తన భయం గ్రహించి, ఆడుకుంటుంటే పడ్డా నమ్మా అని అబద్ధం ఆడి ప్రాణాలు కుదటబెట్టింది. మనసులో తన కప్పుడు సుమఅంటే కలిగిన కృతజ్ఞత, ఆదరమూ తల్చుకుంటే ఇప్పటికీ ఒక వింత అనుభవంగానే ఉంటుంది.

సుమలో చిన్నప్పటి ఆ మృదుత్వానికి ఇప్పుడో గాంభీర్యమూ దీర్ఘాలోచనా వచ్చి కలిసినై. ఈపరిణామం తన కళ్లముందు తాను చూస్తూఉండగా చిటికెలో జరిగినట్లుంది.

సుమమీద తన చిన్నతనంనాటి అధికారం తనకు తెలియకుండానే ఈ రెండుమూడేళ్లలో చెయి జారిపోయింది. పూర్వస్థితి వ్యత్యస్తమై ఇప్పుడు క్రమంగా సుమదే తనకన్నా పైచెయ్యి అవుతున్నట్టుగా కనపడుతోంది!

* * * *

"ఎప్పుడు వచ్చావు మధూ? రా, కూర్చో. కులాసాగా ఉంటున్నావా" అని సుమ సంతోషంతో చిరునవ్వుతూ పలకరించి ఉయ్యాలబల్లమీద కూర్చోమని తనుకూడా పక్కన కూర్చుంది. మధు కెందుకో ఈసారి సుమను చూడగానే కొత్తవేసింది. మధ్యమధ్య సెలవుల కింటికి వచ్చినప్పుడు సుమదగ్గరే తనకు కాలక్షేపం. ఇంట్లో ఒక్క క్షణమేనా ఉండవేమిట్రా అని తల్లి మొత్తుకొనేది. సుమతో కలిసి చిన్నతనపు ముచ్చట్లు జ్ఞాపకంచేసుకుంటూనో, వర్తమానంగురించీ భవిష్యత్తుగురించీ అర్థంలేని ఊహాలు అల్లుతూనో గడిపేవాడు. కాని ఇప్పుడు తన ఎదుటికి వచ్చిన ఆ స్త్రీమూర్తిని చూడగానే, సుమ చిరపరిచితమైన బాల్యదశ దాటి యౌవ్వనంలో అడుగు పెట్టిందన్న విషయం మనస్సుకు ఒక్కసారిగా కశాఘాతమై తాకింది. క్రీజెడ వేసుకొని పట్టుచీర గట్టి యవ్వనపు పొంగుతో తెల్లతాచులా మిసమిసలాడుతోంది సుమ! తళతళ మెరుస్తున్న ఆ కళ్లూ, వయసుతో సమ్మోహనమైన ఆ రూపమూ చూస్తుంటే, మధుహృదయం తడిత్తాడితసాగరంలా సంక్షుభితమై రక్తం హోరుమంటూ నిలువెల్లా ఒక్కసారి ఉరవడించింది.

"సాయంత్రంబండికి వచ్చా సుమా. అప్పుడే మీ ఇంటికి వత్తామనుకున్నాగాని నిద్రలు పోయి ఉంటారు లేపవలసివస్తుం దని రాలేదు. పట్నంనుంచి కిందటిసారి నువ్వు తెమ్మనమన్న గాజులు తీసుకొచ్చా. కాని ఈ ఆరునెలలలోనే ఇంత లావు అవుతావనుకోలేదు! అయినా చూడూ" అంటూ మధు పొట్లంలోంచి గాజులు తీసి ఇచ్చాడు. వాటిలోంచి ఒకటి తీసుకొని సుమ తొడుక్కోటానికి ప్రయత్నించింది. గాజు మధ్యలోనే చిట్లింది. ఎందు కష్టపడతావు, అనవసరంగా అని మధు అంటున్నమాటలు వినిపించుకోకుండా తెచ్చిన గాజుల్లో సగం చిట్లగొట్టి పోగులుపెట్టినతర్వాతగాని సుమ తన ప్రయత్నం విరమించలేదు. మణికట్టువరకు చెయ్యి గాట్లతో నిండి ఎర్రగా కందిపోయింది!

సుమ మళ్లీ సంభాషణ ఎత్తబోయింది; ఇంతలో దూరంగా గొడ్లపాకవైపునుంచి బాధతో గుక్కపట్టి ఏడుస్తున్న పసిపాపరోదనం ఆకస్మికంగా వినిపించింది.

"మధూ, ఎవరిదో పసిపిల్ల ఏడుపులాగా ఉంది. వినిపిస్తోందా నీకు? ఈవేళప్పుడు గొడ్లపాకలో చంటిపిల్ల లెవ రుంటారు? ఏమిటో చూసివద్దాం రా." అంటూ సుమ లేచింది.

పాకలో ఒకమూల దూలానికి మురికిబట్ట ఒకటి ఉయ్యాలగా కట్టిఉంది. సుమ మెల్లిగా మడతలు తొలగించి చూసింది. పసిపిల్లడి తల ఆముదంఓడుతూ, ముఖంఅంతా జిడ్డుతోను మట్టితోను అసహ్యంగా అట్టలుగట్టి ఉంది. చూస్తేనే డోకు వచ్చేంత రోతగా ఉన్నాడు.

"మా పనిమనిషి నరిసిపిల్లడు. పసికుంకను ఒక్కణ్ణే ఇక్కడ వదిలేసి ఎక్కడికో పనిమీద పోయినట్టుంది."

పాలేళ్లందరూ అన్నాల కిళ్లకు వెళ్లారు. పాకలో ఎవ్వరూ లేరు. పిల్లడు కక్కటిల్లిపోతున్నాడు. కారణం ఏమిటో తెలియటం లేదు. కనుచూపు మేరలో పెద్దవాళ్లెవరూ లేకుండా చూసి సుమ గభాల్న పిల్లణ్ణి బుజాలమీదికి తీసుకుంది.

"మధూ, చూశావా పాపం. చీమలు ఎలా పుట్టలుపోసినయ్యో బట్టలో! ఎంత బాధ లేకపోతే అలా ఏడుస్తాడు పసికుంక!" అంటూ ఉద్వేగంతో పిల్లణ్ణి గుండెలకు హత్తుకున్నది. జాలితోను బాధతోను ముఖం కుంచితమైపోయింది. కొంతసేపు బుజాలమీద వేసికొని ఊపి సముదాయించి ఊరుకున్న తరవాత ఉయ్యాల దులిపి పడుకోబెట్టింది. రెండుమూడు ఊపులతో పిల్లడు నిద్రపోయినాడు. జుగుప్సాకరంగా ఉన్న ఆ దాసీశిశువుమీద సుమ కురిపించిన ప్రేమ పారవశ్యాన్ని చూసి మధు ఏదో చెప్పలేని ఆనందంతోనూ ఆవేదనతోనూ ఆపాదమస్తకం కంపించిపోయినాడు!

"పట్నంవిశేషా లేమిటి మధూ? సాయంత్రం పూట రోజూ బీచికి షికారు వెళ్తూఉంటావా? ఒకసారి పట్నం తీసికెళ్లి సముద్రం చూపింతూ. సముద్రం ఎన్నిసార్లు చూసినా నాకు తనివితీరదు. కళ్లు తిరిగేట్టు ఎటు చూసినా అంతు కనిపించని ఆ నీళ్లూ, నిలువునా లేచి ఎగిరిపడే ఆ తరంగాలూ, ఆ ప్రచండమైన ఘోష వింటుంటే ముందు ఏదో విపరీతమైన భయం వేస్తుంది! కాని తర్వాత తర్వాత ఆ భయంలోనే ఒక విచిత్రమైన ఆకర్షణ కనిపిస్తుంది. జీవితంలో మనం చెయ్యవలసిం దేదో ఉందనీ, అది చెయ్యలేకపోతున్నామనీ, మన కప్పుడప్పుడూ కలుగుతూఉండే ప్రచండమైన ఆవేదన, అశాంతీ సముద్రాన్ని చూస్తుంటే మరింత భయంకరంగా మనస్సును ఆవహిస్తయ్. సముద్రంకూడా మనలాగే దేనికోసమో క్షోభపడుతూం దనిపిస్తుంది. వెర్రిగా చేతులు చాచుతూ ఆకాశాన్ని అరుమకోవాలని సముద్రుడి నిరంతరప్రయత్నం. పైనుంచీ సముద్రుడి హృదయసంక్షోభాన్ని కనిపెట్టి జాలితో వాలి లాలిస్తున్నట్టుగా ఉంటుంది, ఆ ప్రశాంతమైన ఆకాశం. మధూ, మన మామూలుజీవితంకన్నా ఉత్తమమైన జీవితం సాధించాలని మనం పడే తాపత్రయాన్నీ, ఆవేదననూ ఆ ఆకాశంలాగే ఏదో అదృశ్యశక్తి పైనుంచి వీక్షిస్తూ మనలను కనిపెడుతూ ఉంటుందని గాఢనమ్మకం కలుగుతుంది నాకు ఆ ఆకాశసాగరాలను చూస్తున్నప్పుడు! దూరంగా, అతిసుదూరంగా, దిగంచలాలలో ఎక్కడో సముద్రం చివరికి ఆకాశాన్ని అందుకుంటుంది! ఆకాశం సముద్రుణ్ణి హత్తుకుంటుంది! జీవితసత్యమంతా ఆ ఆకాశసాగరాల సంగమంలో ఉందనిపిస్తుంది! మధూ, నీకూ అటువంటిభావాలే కలుగుతయ్యా సముద్రాన్ని చూసినప్పుడు?" హృదయంలో సాగరసంక్షోభాన్ని ప్రత్యక్షంగా వింటున్న మధు "అవును, సుమా" అని సాక్షాదనుభూతిద్వారా సమాధాన మిచ్చాడు!

మధు కొంతసేపటికి తన దీర్ఘమౌనంలోంచి బైటపడి, వెళ్లివస్తానని లేచాడు.

"మధూ, రేపు మా ఇంట్లో పూజ. పొద్దున్నే తోటలోకి వెళ్లి పూలు కోసుకురావాలి. నువ్వుకూడా వస్తావా? రాత్రికి నిన్ను భోజనానికి పిలుద్దామనుకున్నాను. పోనీ, ఇవ్వాళ వద్దులే; రేపు వత్తువుగాని. అంత మరీ వచ్చినమూన్నాడే ఇంట్లో తిననివ్వకుండా లాక్కొస్తే మీ అమ్మ బాధపడుతుంది."

"అలాగే రేపు వస్తాలే" అంటూ మధుకర్ వెళ్లిపోయినాడు. దూరమై పోతున్న అతని అస్పష్టరూపంవంక చూస్తూ సుమ పరధ్యానంలో పడ్డది. ఆ రేగిపోయిన జుట్టూ, కాళ్ల కడ్డాలుపడుతున్న ఆ పైజమాలూ చూస్తే, మధు కింకా తన సంరక్షణ తాను చూసుకోటం చేతకాదనిపించింది. ప్రయోజకుడై ముసలితల్లి నెప్పుడు సుఖపెడతాడా అని దిగులు పడ్డది సుమ. మధు ఇంకా నీళ్లు పోసి అన్నంకలిపి పెట్టవలసిన స్థితిలోనే ఉన్నా డనిపించింది. సుమ హృదయం మధుమీద ప్రేమవాత్సల్యాలతో పొంగిపోయింది!

మధుతో సుమకు రోజులు క్షణాలుగా గడిచిపోతున్నయ్. కాని మధుహృదయంలో తీవ్రమైన అశాంతి ప్రవేశించింది. ఈత రాక మునిగిపోతున్న మనిషి కాళ్లూ చేతులూ కొట్టుకున్నకొద్దీ నీళ్లు తాగి మరింత ఉక్కిరిబిక్కిరైనట్టు, మధుకర్ ఆ అశాంతి నుంచి తప్పించుకోటానికి ప్రయత్నించినకొద్దీ వ్యథ మరింత తీవ్రం కాసాగింది.

* * * *

"పది పదిహేనురోజుల్లో రమ్మని రాశారు, మధూ! తిండీ తిప్పలూ సరిలేక పాపం ఎంత అవస్థ పడుతున్నారో. నిన్నీమధ్య చూసినప్పుడు చెప్పారా నీతో? వారికి ధనార్జనమీద మోజు లేదు. బీదసాదలకు ఉచితంగా వైద్యం చేస్తూ ఉన్నదానితోనే కాలక్షేపం చెయ్యాలని నిశ్చయించుకున్నారు. నీకిది అభిమతమేనా అని అడిగారు నన్ను. జీవితంలో నేనింతకన్న కోరుకోగలిగిందేముంది, మధూ? దరిద్రులకు దీనులకు ఆర్తితీర్చడంకన్న ఆనందం ఏమిటి? బీదసాదలు అగచాట్లు పడతారంటే ఆశ్చర్యంలేదు. కాని అన్నీ ఉండి రోజులు సుఖంగా గడపవలసిన వారుకూడా జీవితాలు పాడుచేసుకుంటారే, వారినేమనాలి మధూ? కొంచెం శాంతం, రవంత ప్రేమ అలవర్చుకుంటే జీవితం స్వర్గతుల్యంగా చేసుకోవచ్చునే! దరిద్రుల బాధలైతే తీర్చవచ్చునుగాని ఈ అంధులకు కళ్ళువిప్పటం ఎలా?"

ఆవేశంతో సుమకళ్ళు తళతళ మెరుస్తున్నయ్. మధు మంత్రముగ్ధుడై చూస్తున్నాడు. సుమ మాటలాపివేయగానే హఠాత్తుగా మెలకువ వచ్చినట్లయింది మధుకు.

"సుమా, అప్పుడే వెళ్ళిపోతావా? సెలవులయినదాకా అయినా వుంటావనుకున్నాను."

సుమ నవ్వింది. "నాతో కూడా మావూరికి రారాదూ మధూ? మావారిని చూసినట్టూ వుంటుంది; నన్ను దింపినవాడవూ అవుతావు." మధు పలకలేదు.

"మధూ, మీఅమ్మ ఒక్కత్తె ఎన్నిరోజులని కొట్టుకుంటుంది? నీకోసం ఆడమనిషి ఆవిడ రైతుల చుట్టూ తిరిగి శిస్తులు వసూలుచేసి డబ్బు పంపుతూండబట్టి పట్నంలో నీచదువు సాగుతోంది. జాగ్రత్తగా చదివి చప్పున ఒడ్డెక్కు. నీవింత సంపాదించి తెస్తే ఈ వార్ధక్యంలోనైనా రోజులు హాయిగా గడపవచ్చునని ఆమె గంపెడాశ పెట్టుకుంది.

ఏం మధూ, మాట్లాడకుండా అలా కూర్చున్నావేమీ? ఒంట్లో బాగా లేదా? ముఖం వాడి ఉంది."

అని సుమ మధుకర్ దగ్గరకు వచ్చి నుదుటిమీద చెయ్యివేసింది. ఆ స్పర్శ మధు అంతరాంతరాలలోకి వెళ్ళి తాకింది. రక్తం అగ్నిజ్వాలలై నాలుకలు చాచుకుంటూ నరనరాలగుండా తటిద్వేగంతో ప్రవహించింది.

"నుదురు వెచ్చగా ఉంది. జ్వరంపెట్టుకు రాదు గదా?"

"కొంచెం తలనెప్పిగా ఉంది. పోయి పడుకుంటే అదే పోతుంది. వెళ్ళొస్తా సుమా" అని నిట్టూర్చి బరువుగా అడుగులు వేసుకుంటూ కదలిపోయినాడు మధు.

* * * *

మధు క్రమంగా ఇల్లు కదలటం మానేశాడు. సుమ తను ఇంటికి వస్తే బైట ఏదో పనివున్నట్టు వెంటనే ఇంట్లోంచి వెళ్ళిపోయేవాడు. మధు ప్రవర్తనలో ఈమార్పు సుమకు అర్థంకాలేదు. తనతో అంతవరకు అతిచనువుగా మాట్లాడుతూ పసిపిల్లడిలాగా వెంటనంటి తిరుగుతున్న మధు తనమీద ఒక్కసారిగా ఇంత ఉపేక్ష వహించడం సుమహృదయానికి తీవ్రమైన ఆఘాతం వలె అయింది. బాధతో సుమ లోలోపల కుమిలిపోతోంది. మధుమనస్సుకు ఎప్పుడైనా నొప్పి కలిగించానేమోనని మథనపడ్డది. కాని ఎంత తల బద్దలు కొట్టుకున్నా తాను చేసిన తప్పేమిటో తోచలేదు. చివరకు సూటిగా మధుకర్నే కారణం అడగాలని నిశ్చయించుకుంది. తడబడుతున్న హృదయంతో అడుగులో అడుగు వేసుకుంటూ సుమ ఒక సాయంత్రం మధుకర్ ఇంటికి వెళ్ళింది. కనుచీకటి; గదిలో మంచం మీద కళ్ళుమూసుకొని పడుకొని ఉన్న మధు ఆకారం అస్పష్టంగా కనిపిస్తోంది. చుట్టూ పుస్తకాలు పడిఉన్నయ్. వణుకుతున్న చేతులతో సుమ దీపం తీసుకొని గదిలో ప్రవేశించింది.

"మధూ!" వ్యథతో గద్గదమౌతున్న ఆ స్వరం మధు హృదయంలో తీవ్రశరంలా నాటుకున్నది. హీనస్వరంతో "సుమా, వచ్చావా" అని మధు తలయెత్తి చూశాడు.

"ఆఁ, వచ్చాను. నాతో మాట్లాడటం ఎందుకు మానేశావో కారణం చెబుతావేమో తెలుసుకోవాలని వచ్చాను." కళ్లలో చిందుతున్న అశ్రుబిందువులూ, ఆ ప్రశ్నలోని వింత కర్కశత్వమూ కలిసి మధు హృదయాన్ని మరింత కలతపెట్టినయ్.

"సుమా, కారణం ఏమీ లేదు. పరీక్షలకు ఇప్పట్నుంచే గట్టిగా చదవాలని చదువుతున్నా. తీరిక లేక మీ ఇంటికి రావటం లేదుగాని అంతకన్నా ఏమీ లేదు".

"మధూ, నువ్వు చెబుతున్నది నే నమ్మను.

నా మాటల్లోనో ప్రవర్తనలోనో నీ మనస్సుకేదో కష్టం కలిగించి ఉంటాను. ఎప్పుడైనా అటువంటి పొరపాటు నావల్ల జరిగిఉంటే మన్నించు. కాని నాతో మాట్లాడటం మాత్రం మానివెయ్యకు మధూ!" అని పొంగివస్తున్న దుఃఖాన్ని అణుచుకొని సుమ ప్రాధేయపడ్డది.

"సుమా, నాకీ అగ్నిపరీక్ష పెడతావెందుకు? నన్నిట్లా వేటాడి హింసించటం ఆనందమా నీకు?" అని మధు, మనస్సులో దీనంగా మొరపెట్టుకున్నాడు. కాని ఆ మొర సుమ ఆలకించలేకపోయింది!

"మధూ, నేనెన్ని తప్పులు చేసినా మన్నిస్తానని చేతిలో చెయ్యి వెయ్యి." అంటూ సుమ చెయ్యి చాపింది. మధు యంత్రప్రతిమలా చెయ్యితీసి చేతిలో వేశాడు.

"రేపు ప్రొద్దున్నే నా ప్రయాణం. ఇవ్వాళ మనం రాజీపడిన దానికి గుర్తుగా రాత్రి మా ఇంట్లో భోజనం చెయ్యాలి. అక్కడే పడుకుందువుగాని, కబుర్లు చెప్పుకుంటూ ఈ నాలుగుగంటలూ గడుపుదాం. తెల్లవారితే నేనెలాగూ వెళ్ళిపోతాను."

భోజనాలయినాక సుమ ఇద్దరికీ డాబామీద పక్కలు వేసింది. సుమ భర్తకు తాను చేయబోతున్న ప్రేమపూరితమైన సేవను గురించీ, భర్తతో కలిసి జగతులో తాను సాధించబోతున్న దిగ్విజయాలను గురించీ తాను కంటున్న మధురస్వప్నాలన్నీ ఒకదానివెంట ఒకటి ఏకతీరుగా ఏకరువు పెట్టుకోపోతోంది. మధుకర్ మధ్యమధ్య ఊకొడుతూ తన ఆలోచనల్లో తాను నిమగ్నుడైనాడు. సుమ మాట్లాడుతూ మాట్లాడుతూనే నిద్రపోయింది. ఆ నిశ్శబ్దనిశీథంలో ఆమె ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ప్రశాంతంగా వినపడుతున్నయ్. మధుకర్‌కు ఎంతసేపటికీ నిద్రపట్టలేదు. లేచి పక్కమీద కూర్చుని, సుమ వేపు తదేకంగా చూడసాగాడు.

ఊరంతా నిశ్శబ్దంలో మునిగుంది. పండువెన్నెల విరియగాస్తోంది. సుమ ముఖంమీద వ్రేలుతున్న ముంగురులను ఒకసారి రేపుతూ మరొకసారి సవరిస్తూ చల్లనిగాలి మెల్లిగా ఆడుతోంది. వలయాలు తీరిన ఆమె ఉన్నతవక్షం ఉచ్ఛ్వాసనిశ్వాసాలతో లయ కలుపుతూ మృదువుగా లేచి పడుతోంది. ఇంతకాలమూ పోరాడి అణచిపెట్టిన వాంఛలన్నీ ఒక్కసారిగా కట్లు తెంచుకొని విజృంభించినై. మధుకర్ హృదయంలో ఝంఝామారుతం రేగింది. కళ్లలో చీకట్లు చుట్టలు చుట్టుకున్నయ్. చెవులు హోరుమంటున్నయ్. లేచి పిల్లిలాగా అడుగులు వేసుకుంటూ సుమను సమీపించి ముఖంలోకి వంగి చూశాడు.

సౌఖ్యమే తప్ప కష్టమెరుగని ఆ చిరునవ్వూ, ఆ అమాయిక శిశువదనమూ మధుకర్ని హఠాత్తుగా ఆకట్టినయ్. పదునైన కత్తిని గుండెల్లో అమాంతం దిగబొడిచినట్టయింది. బాధతో రెండుచేతులా గుండెలు బిగియబట్టుకొని మధుకర్ వెనుదిరిగి బైటికి వెళ్లిపోయినాడు.

* * *

"అనంతమైన దుఃఖమే జీవితధర్మం. నిజమైన సౌఖ్యమూ ఆనందమూ ప్రపంచంలో లేవు. ఒకవేళ ఉన్నట్టు కనపడ్డా అవి క్షణికం. భయంకరమైన కాళరాత్రిలో తళుకుమని మెరిసిపోయే మెరుపులవంటివీ సుఖసౌఖ్యాలు. జీవితంలోని అంధకారపు లోతులను తడివిచూసుకోటానికి మాత్రమే అవి ఉపకరిస్తవి. సుమా, రంగురంగుల దారాలతో నీ అల్లుకున్న మాయాజాలం ఒక్క ఫూత్కారంతో సాలీడుగూడులా విరిసిపోయింది. కష్టపడి కట్టుకున్న ఆకాశసౌధాలన్నీ ఒక్క గాలితెర వీయగానే కుప్పన కూలిపోయినై. సౌఖ్యమూ ప్రేమా అన్న పదాలు ఎంత మిథ్యావచనాలో, వాటిలో ఎంత ప్రతారణ దాగి ఉందో నీకిప్పటికైనా బోధపడిందా? యథార్థం కళ్లెదుట కనిపిస్తుంటే ఊరికే ఆత్మవంచన చేసుకొని ప్రయోజనం ఏమిటి? నీ పరాజయాన్ని అంగీకరించు. ఆ అంగీకరించటంలోనే ఒక శాంతి ఉంది."

"నేను ఒప్పుకోను; ఒప్పుకోను; ముమ్మాటికీ ఒప్పుకోను" అంటూ సుమ ఆత్మ తనలో ధ్వనిస్తున్న ఆ నిరాశాస్వరంమీద ఆక్రోశంతో తిరగబడ్డది

కాని అంతలోనే అలసట కమ్మి, కొనఊపిరి విడుస్తున్న ప్రాణిలా విలవిలలాడి మళ్లీ నిర్వేదంలో మునిగిపోయింది. భర్తతో కలిసి దీనుల దుఃఖాశ్రువులు తుడుస్తూ వారి జీవితాలను సుఖమయం చేయాలని కలలుగన్న ఆమె జీవితమే భర్తృవియోగంతో కన్నీళ్ల కలిసింది. తన దాంపత్యజీవితం మూణ్ణాళ్లముచ్చటగా కళ్లెదుట తేలిపోయింది. భర్తతో గడిపిన రెండేళ్లూ రెండుక్షణాలుగా సుమకు తోచినై. భర్త ఉజ్వలమైన ఆశయాలలో, అతని అనురాగంలో స్వర్గసుఖాలె

లకు తాను సేతువు నిర్మించుకుంది. ఆతని సమక్షంలో తనకు చెప్పలేని ఆనందమూ, శాంతీ. అతని కళ్లూ, మాటలూ, చేతలూ తన్నుకనఃకట్టి, ఎప్పుడూ చూచే ఈ మామూలు ప్రపంచాన్నే ఏదో అద్భుతమైన మాధుర్యంతో నింపివేసేవి.

"సుమా, నిన్నుగాక మరెవర్నైనా పెళ్లిచేసుకొనుంటే నా జీవితం ఎలా ఉండేదా అని ఊహించుకున్నప్పుడల్లా నాగుండెలు భయంతో జలదరించిపోతయ్. సుమా, నా జీవితంలో ఉన్న ప్రచండమైన అశాంతికీ, అసంతృప్తికీ, నీవే తోడులేకపోతే నే నేమయేవాణ్నో!" అంటూ ఒకసారి అతడు చీకట్లో జడుసుకున్న పసిపిల్లడిలాగ వణికిపోతూ తన గుండెల్లో తల దాచుకున్నాడు. తన హృదయం అప్పుడు ఎంత గర్వంతో, ఎంత పరమానందంతో ఉప్పొంగిపోయింది. అటువంటి తమ దాంపత్యజీవితానికి అంతలోనే ఆశ్వాసాంతం ఆవిధంగా వస్తుందని సుమ ఊహించలేకపోయింది.

ఒకరోజున హఠాత్తుగా ఊరంతా స్ఫోటకం వ్యాపించింది. పేదవారి పేటలు మృత్యుదేవత ప్రళయ తాండవానికి ప్రధానరంగాలైనయ్. పోసినవాళ్లకే మళ్లీమళ్లీ పోతపోస్తోంది. ఇంటికి నలుగురూ అయిదుగురూ మంచాలు పడుతున్నారు. కొందరికి అట్ట పోత పోసి చూడడానికి భయంకరంగా ఉంది. పోసిన వాళ్లలో బతికినవాళ్లు బహుకొద్దిమంది. డాక్టర్లు మొదటి వారంరోజులూ పేటల్లోకి వెళ్లారుగాని, తర్వాత ధైర్యం చాలక ఈ రోగానికి మందు లేదంటూ వెళ్లడం మానేశారు. పేదవారి గుడిసెల్లో వాహనులు లేక శవాలు మురిగి కంపుకొడుతున్నయ్.

సుమభర్త రాత్రింబగళ్లు మురికికూడాలలో తిరుగుతూ వ్యాధిగ్రస్తులకు ఉపశమనంకోసం తోచిన చికిత్సలు చేస్తున్నాడు. సుమ దడదడ కొట్టుకుంటున్న గుండెలతో, భర్త అన్నానికి ఎప్పుడు వస్తాడా, హృదయశాంతి మళ్లీ ఎప్పుడు చేకూరుతుందా అని ఆతని రాకకోసం ఎదురుచూస్తూ, బైటికి వెళ్ళగానే యథాప్రకారం దిగులారంభమై కంటికి కూరుకు లేకుండా అహోరాత్రాలు గడుపుతోంది. మరణశిక్షకోసం నిరీక్షిస్తున్న దేశభక్తుని కళ్లలోవలె సుమకళ్లలో ఒక వింతవెలుగు వెలుగుతోంది. ఒకపూట సుమభర్త వడ్లగింజ పేలపుగింజగా జ్వరంకొస్తూ ఇంటికి వచ్చాడు. నల్లపోత పోసింది. మూడురోజుల్లో ఆశ్వాసం సమాప్తమైంది.

సుమఆశయాలూ ఆశలూ భర్తచితిలో బుగ్గైనై. బుద్బుదాలలాగా ఆమెస్వప్నాలు జీవితంలో క్షణకాలం మెరిసి చిట్లిపోయినై. గంపెడు చీకటి నెత్తిన వేసుకొని సుమ పుట్టింటికి తిరిగి వచ్చింది.

సుమకు జీవించాలన్న వాంఛ క్రమంగా అడుగంటింది. నిరంతరమైన దుఃఖంతో కుంగి కృశించి మంచాని కంటుకుపోయింది. మనస్సు మోడుపడి బహిః ప్రపంచపు సుఖదుఃఖాలు అంటటం మానివేసినై. మూగబాధతో మృత్యువుకోసం నిరీక్షిస్తూ సుమ రోజులు గడుపుతోంది.

ఒకనాడు పట్నంనుంచి వార్త వచ్చింది. మధుకర్ ఏదో దిగులుపడుతున్నవాడిలా పొద్దస్తమానం గదిలోనే విచారంగా కూర్చుంటున్నాడనీ, ఆరోగ్యం చెడి తిన్నగా కాలేజీకి వెళ్లటం లేదనీ విన్నప్పుడు, సుమకు మళ్లీ భర్తపోయిన తర్వాత మొదటిసారిగా బాధ తెలిసింది. ఆమె హృదయంలో రాజుతున్న అగ్నిని ఒక్కసారిగా ఎగసన దోసినట్లయింది. మధుకర్‌కు తల్లి ఎంత జబ్బు పంపుతున్నా చాలటం లేదు. ఆమె పడుతున్న అవస్థలు చూడలేక సుమ ఒకటిరెండుసార్లు తల్లి పేరిట మధుకర్‌కు మనిఆర్డర్లు పంపింది.

మధుకర్ సెలవులకు మళ్ళీ ఇంటికి వచ్చాడు. తిన్నగా సుమను చూడటానికి బయలుదేరాడు. గుండెల బరువుతో అడుగుతీసి అడుగు వేసేటప్పటికే చాలి వస్తోంది. అల్లాగే కాళ్ళీడ్చుకుంటూ, అడుగామడగా సాగి వెళ్లాడు జీర్ణశీర్ణమై పోయిన ఆ శరీరం, ముఖంలో ప్రతి రేఖలోనూ వ్యక్తం అవుతున్న ఆ మూగబాధ చూడగానే మధుకు కళ్ళలో నీళ్లు గిర్రున తిరిగినై. సుమ వంక చూడలేక అప్రయత్నంగా తల తిప్పుకున్నాడు. చెప్పలేని మనోవ్యథతో, తడబడుతూ వెళ్లి మౌనంగా ప్రక్కను కూర్చున్నాడు. మధుకర్ దీన ముఖమూ, కళ్లలోని ఆ తప్తాశ్రువులనూ సుమ చూసింది. రెండుచేతులూ చాపి మధుముఖాన్ని గుండెల మీదికి తీసుకొని జాలిగా నిమురుతూ "ఏడవకు, మధూ, ఏడవకు. మళ్లీ ఇక ఎప్పటికీ నన్ను విడిచిపెట్టి పోవుగద" అన్నది. ఇరువురి హృదయాలూ క్షణకాలం ఒక అనిర్వచనీయమైన మహాశాంతిలో లీనమైపోయినై! వర్షాధాతప్రభాతంలా అశ్రుసిక్తమైన ఆతని ప్రసన్న దృష్టిలో సుమ కథయం గోచరించింది.